

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 180 పేజీలు - 08 వెల - 05/-

ఆదివారం 28-06-2026


ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో

## సిద్ధార్థ నాయుడు.



# సంజీవనితో ఆరోగ్య సేవలు మరింత సులభం




- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలుకు నిర్ణయం
- ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ రికార్డులతో సమగ్ర ఆరోగ్య పర్యవేక్షణ
- కాలర్ ఎగరేసేలా అమరావతి నిర్మాణం ఉంటుందని స్పష్టీకరణ
- వైసీపీ మూడు ముక్కల ఆట ఆడి రాష్ట్రాన్ని దెబ్బతీసిందని విమర్శ

మార్కాపురం జిల్లా, గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టిపల్లెలో 'సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్'ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి నిర్మాణంపై సీఎం స్పష్టత ఇచ్చారు. ప్రతి ఒక్కరూ కాలర్ ఎగరేసి చెప్పుకునేలా అమరావతిని ప్రపంచ స్థాయి హరిత నగరంగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. "గొడ్డలి పార్టీ ముందు అమరావతిని అంగీకరించి, ఆ తర్వాత మూడు ముక్కల ఆట ఆడింది. ఐదేళ్ల పాటు అభివృద్ధిని ఆమడ దూరం పెట్టింది" అని అన్నారు. అమరావతిపై చట్టం అయిపోయాక కూడా 'మావిగన్' అంటూ పట్టుకుని వేలాడుతున్నారని, ప్రజలు ఛీ కొడుతున్నా బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసీపీ క్రిమినల్ రాజకీయాలతో సమాజానికి, ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపైనా సీఎం మాట్లాడారు. అన్నదాత పథకం కింద మొదటి విడత నిధులు విడుదల చేశామని, వచ్చే నెలలో 'తల్లికి వందనం' నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. వ్యవసాయంలో విచ్చలవిడి ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సేద్యం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. జనాభా నిర్వహణ తక్షణ అవసరమని, ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచన చేస్తున్నామని ఓ ఆసక్తికరమైన అంశాన్ని ప్రస్తావించారు. ప్రస్తుత యువతరం జెన్ జీ, జెన్ ఆల్ఫా వర్గాల్లాగే ఆలోచనల విషయంలో తాను కూడా జెన్ జీనే అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

> కిష్టంశెట్టిపల్లెలో 'సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్'ను ప్రారంభించిన చంద్రబాబు



భవిష్యత్తును ముందుగానే ఊహించి, దానికి అనుగుణంగా టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో మన మిగతా 2లో

85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు

# చెలగాటం ఆడుతున్నారు

● మధ్యాహ్న భోజనం వండుతున్న వారి జీవితాలతో చంద్రబాబు ఆడుకుంటున్నారన్న జగన్ ● స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపాటు ● వారికి బకాయి పెట్టిన జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్



గవర్నమెంటు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం వండుతున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. దాదాపు 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్నవారు, వీరిలో చాలామంది ఉన్నారని... ఇప్పుడు, స్మార్ట్ కిచెన్స్ పేరుతో తన పార్టీవారి పొట్టలు నింపుతూ, అక్కచెల్లెమ్మలను మాత్రం రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగా మిగతాది 2లో

# ఇందిరమ్మ ఇళ్లు:

స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

- నిర్మాణ వ్యయం పెరగకుండా అదుపు చేసేందుకే ఈ నిర్ణయం
- 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యే స్లాబ్ ఉండాలని ఆదేశం
- ముందువైపు మూడు అడుగులు, మిగతా వైపులా ఒక అడుగు మించరాదని స్పష్టీకరణ
- లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ


2

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వ్యయం లబ్ధిదారులకు భారంగా మారకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విధిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త.. జూలై 15 నుంచి

# కొత్త ఆరోగ్య పథకం

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్యమే లక్ష్యం


2

- ఉద్యోగ దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్ వసూలుకు నిర్ణయం
- త్వరలోనే ఆసుపత్రుల జాబితా, ప్యాకేజీ రేట్లను ప్రకటించనున్న ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, క్రమబద్ధమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జూలై 15న ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో పథకం ప్రారంభ తేదీని ఖరారు చేశారు. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలు,

# హోంమంత్రి అనితకు బాధితుడి ఫిర్యాదు

ఫేస్‌బుక్ కామెంట్‌పై భూమన అనుచరులు కిడ్నాప్ చేశారని బాధితుడి ఆరోపణ

● నాలుక కోసి, నరాలు కట్ చేసి చంపేందుకు యత్నించారని ఫిర్యాదు ● సజ్జల ఫోన్‌తో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చారని ఆవేదన ● టీడీపీ గ్రీవెన్స్‌లో హోంమంత్రి అనితకు బాధితుడు పత్తి మణి అర్జీ ● తనపైనే అక్రమ కేసులు పెట్టి, కుటుంబాన్ని వేధించారని ఆరోపణ



ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ కామెంట్‌కు ప్రతిగా తనను కిడ్నాప్ చేసి, చంపేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఓ బాధితుడు ప్రస్తుత హోంమంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా రాజంపేట మండలం మన్నూరు గ్రామానికి చెందిన పత్తి మణి, మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రితో పాటు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.డి. నజీర్‌కు తన గోడును విన్నవించారు. బాధితుడు పత్తి మణి తెలిపిన వివరాల ప్రకారం, 2023 జూన్ 9న నాటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి, మిగతాది 2లో

## టీఎన్‌సీసీ కొత్త అధ్యక్షుడిగా మాణికం ఠాకూర్

2


'ఆపరేషన్ దేవేంద్ర'తో ఫడ్నవీస్‌కు

## చెక్ పెట్టేందుకే!

: అమిత్ షాపై ఉద్ధవ్ ఠాక్రే సంచలన ఆరోపణ

2


## 'సర్'ను సీరియస్ గా తీసుకోండి

- మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్
- కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి
- రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా



మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మిగతాది 2లో

## భాగ్యరాజ్ మృతి పై పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

● భాగ్యరాజ్ మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్ ● స్క్రీన్‌ప్లే కింగ్ గా భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేశారని కితాబు ● ఆయన సినిమాలను మలిచిన తీరు ఒక తరం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుందని వ్యాఖ్య



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో, ముఖ్యంగా కోలీవుడ్‌లో ఒక అద్భుతమైన శకం ముగిసింది. మిగతాది 2లో

# ఇందిరమ్మ ఇళ్లు: స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు



నిర్ణయం తీసుకుంది. ఇళ్ల స్లాబ్ పరిమాణంపై పరిమితులు విధిస్తూ శనివారం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. పేద లబ్ధిదారులు అనవసరపు ఖర్చులతో అప్పుల పాలు కాకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఇకపై ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్‌ను 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించుకోవాలి. స్లాబ్ ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ముందువైపు మూడు అడుగులు, మిగతా మూడు వైపులా ఒక్క అడుగుకు మించరాదని స్పష్టం చేశారు. కొత్తగా చేపట్టే నిర్మాణాలతో పాటు, ప్రస్తుతం బేస్‌మెంట్ లేదా రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. చాలామంది లబ్ధిదారులు అవసరానికి మించి పెద్ద సైజులో స్లాబులు వేస్తుండటంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరుగుతోందని గృహ నిర్మాణ సంస్థ గుర్తించింది. గోడల నుంచి ఎనిమిది అడుగుల వరకు కూడా స్లాబులను పొడిగిస్తున్న సందర్భాలు ఉన్నాయని, దీనివల్ల పేద లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోతోందని అధికారులు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం ఈ పరిమితులు విధించింది. ఎండ, వానల నుంచి రక్షణ కోసం భారీ ఆర్‌సీసీ స్లాబులకు బదులుగా కిటికీలు, తలుపులపై సన్‌షేడ్లు, టైల్డ్ రూఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందిరమ్మ పథకం కింద అర్హులైన పేదలకు సొంత ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సాయం దుర్వినియోగం కాకుండా, లబ్ధిదారులకు భారం కలగకుండా గృహ నిర్మాణం పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ కొత్త నిబంధనలపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందిని ప్రభుత్వం ఆదేశించింది.

# హోంమంత్రి అనితకు బాధితుడి ఫిర్యాదు

జూన్ 9న నాటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి, "నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లను తిరుపతిలో అడుగుపెట్టనివ్వం" అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన తాను.. "ఇది రాచరిక పాలన కాదు, ప్రజాస్వామ్యం. ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు... మీరు నందలూరు నుంచి తిరుపతి వెళ్లలేదా?" అని కామెంట్ పెట్టినట్టు వెల్లడించారు. ఈ కామెంట్‌ను మనసులో పెట్టుకున్న భూమన అనుచరుడు రాజు మరికొందరితో కలిసి జూన్ 11న రాజంపేటలోని హరిత హోటల్ వద్ద తనపై దాడి చేసి, బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారని మణి ఆరోపించారు. కారులోనే తన నాలుక కోసి, చేతి నరాలు కట్ చేసి, కళ్లపై రాళ్లతో కొట్టి చంపేందుకు ప్రయత్నించారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి చేస్తున్న సమయంలో నిందితులు నాటి ఎమ్మెల్యే భూమనకు, ఆయన కుమారుడికి వీడియో కాల్ చేసి చూపించగా.. అవతలి నుంచి "వీడిని బాగా కొట్టి, చంపేసి అలిపిరి అడవిలో పారేయండి" అని ఆదేశాలు ఇచ్చారని మణి సంచలన ఆరోపణలు చేశారు. అయితే, పోలీసులు తమను వెతుకుతున్నారని తెలిసి నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించగా, చిట్వేలి వద్ద పోలీసులు వారిని పట్టుకుని తనను రక్షించారని తెలిపారు. అయితే అసలు కథ ఇక్కడే మొదలైందని, నిందితులను మన్నూరు పోలీస్ స్టేషన్‌కు తరలించగానే నాటి వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి డీఎస్పీకి ఫోన్ చేశారని, దీంతో నిందితులకు వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి, రాత్రి 2 గంటలకు పోలీస్ సెక్యూరిటీతో తిరుపతికి పంపించేశారని మణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత, చావుబతుకుల మధ్య ఉన్న తనపైనే పోలీసులు అక్రమ కేసులు పెట్టారని, తన భార్యను, 3 ఏళ్ల కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో 4 గంటల పాటు అక్రమంగా నిర్బంధించారని వాపోయారు. ఈ అన్యాయంపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన హోంమంత్రిని కోరారు.




# టీఎన్‌సీసీ కొత్త అధ్యక్షుడిగా మాణికం ఠాకూర్

కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) నూతన అధ్యక్షుడిగా



విరుదునగర్ లోక్‌సభ ఎంపీ బి. మాణికం ఠాకూర్‌ను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. 2024 ఫిబ్రవరి నుంచి ఈ పదవిలో కొనసాగుతున్న కె. సెల్వపెరుంతగై స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తును మరింత బలోపేతం చేసే వ్యూహంలో భాగంగానే ఈ నియామకం జరిగినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. సెల్వపెరుంతగై డీఎంకే పట్ల సానుకూల ధోరణితో ఉన్నారనే అభిప్రాయం పార్టీలో ఉండగా, మాణికం ఠాకూర్ ఆది నుంచి టీవీకేతో సన్నిహిత సంబంధాలను కోరుకుంటున్నారు. డీఎంకేతో పొత్తును ఆయన గతంలో బహిరంగంగానే వ్యతిరేకించారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేతో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్, 27 స్థానాల్లో బరిలోకి దిగి కేవలం 5 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఎన్నికల ఫలితాల అనంతరం డీఎంకే కూటమి నుంచి బయటకు వచ్చిన కాంగ్రెస్, అధికార టీవీకేతో జతకట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వంలో రెండు మంత్రి పదవులను కూడా దక్కించుకుంది. ప్రస్తుతం లోక్‌సభలో కాంగ్రెస్ విప్‌గా వ్యవహరిస్తున్న మాణికం ఠాగూర్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజా నియామకం పట్ల, టీవీకే మద్దతుతో రాజ్యసభ ఎంపీ అయిన ప్రవీణ్ చక్రవర్తి హర్షం వ్యక్తం చేశారు. మాణికం ఠాకూర్ నాయకత్వంలో తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పునర్నిర్మితమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'ఆపరేషన్ దేవేంద్ర'తో ఫడ్నవీస్‌కు చెక్ పెట్టేందుకే!



భారీ కుట్ర దాగి ఉందని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే సంచలన ఆరోపణలు చేశారు. ఇది మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను లక్ష్యంగా చేసుకుని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నడిపిన 'ఆపరేషన్ దేవేంద్ర' అని ఆయన పేర్కొన్నారు. ఫడ్నవీస్ జాతీయ స్థాయి రాజకీయ ఆశయాలకు అడ్డుకట్ట వేయడానికే ఈ వ్యూహం పన్నారని ఆయన విమర్శించారు. శనివారం హింగోలిలో నిర్వహించిన బహిరంగ సభలో ఉద్ధవ్ ఠాక్రే ప్రసంగిస్తూ "ఎన్నికలు లేని సమయంలో మా ఎంపీలు పార్టీ మారాల్సిన అవసరం ఏమొచ్చింది? వారు నేరుగా బీజేపీలో చేరకుండా షిండే వర్గంలోకి ఎందుకు వెళ్లారు? ప్రధాని పదవి రేసులోకి ఫడ్నవీస్ రాకుండా నిలువరించి, ఆయన్ను ఒక స్థాయికే పరిమితం చేసేందుకు అమిత్ షా ఈ ఎత్తుగడ వేశారు. భవిష్యత్తులో వారంతా ప్రధాని అభ్యర్థిగా అమిత్ షాకు మద్దతు తెలిపే అవకాశం ఉంది" అని ఉద్ధవ్ అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల ఉద్ధవ్ వర్గానికి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడంతో, పార్లమెంటులో ఉద్ధవ్ వర్గం బలం 9 నుంచి 3కి పడిపోయింది. అయితే, ప్రతిపక్షంలో ఉండటం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని, ఉద్ధవ్ వర్గం నుంచి సరైన సహకారం అందడం లేదని ఫిరాయించిన ఎంపీలు వ్యాఖ్యానించారు. ఈ తాజా పరిణామం 2022 నాటి షిండే తిరుగుబాటును తలపిస్తోంది. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టి, ఉత్తర భారతానికి రాజకీయంగా ఎక్కువ ప్రాధాన్యం కల్పించేందుకే బీజేపీ ఇటువంటి ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని ఉద్ధవ్ ఆరోపించారు. ఇదిలావుండగా, శుక్రవారం ముంబై నుంచి నాగ్‌పూర్‌కు వెళ్లే విమానంలో ఉద్ధవ్ ఠాక్రే, ఫడ్నవీస్ తారసపడటం, పరస్పరం పలకరించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

# వీబీ గ్రామ్ జీని అంగీకరించం

**● రాష్ట్రాల అధికారాలను లాక్కునేందుకు కేంద్రం కుట్ర ● కర్నాటక, కేరళం రాష్ట్రంతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధం ● జులై 2న రాష్ట్ర క్యాబినెట్‌లో తుది నిర్ణయం ● మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

హైదరాబాద్ వీబీ గ్రామ్ జీ చట్టం--2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీ కరించబోదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం రెండో సమావేశం నిర్వహించారు. మంత్రులు దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరిస్తోందని విమర్శించారు. ఇది కేవలం ఉపాధి హామీ చట్ట సవరణ మాత్రమే కాదనీ, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా తగ్గించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదని తేల్చి చెప్పారు. అవసరమైతే ఈ చట్టంపై సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు. సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. కర్నాటక, కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. సమావేశంలో పాల్గొన్న 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని చెప్పారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల ఉపాధి కల్పించాలనీ, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని మోపే ప్రమాదం ఉందనీ, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమన్నారు. ఈ అంశంపై జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. సమీక్ష?లో పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త..

## జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్‌ఎస్ మార్గదర్శకాలు, చికిత్సల ప్యాకేజీ ధరలు, ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో, వారిలో ఒకరి వేతనం నుంచి మాత్రమే హెల్త్ కంట్రిబ్యూషన్‌ను మినహాయించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అటువంటి ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో పూర్తి పారదర్శకతను నిర్ధారిస్తూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా 'ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ట్రస్ట్ పర్యవేక్షణలోనే నూతన ఆరోగ్య పథకం అమలు కానుంది.

# 'సర్'ను సీరియస్ గా తీసుకోండి: కేటీఆర్

రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు.  మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

# 85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారు: జగన్

ఇందులో భాగంగా ఇప్పుడు వారికి ఇవ్వాల్సిన జీతాలు గత రెండు నెలలుగా బకాయిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.  గతంలో మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.వేయి ఉండే జీతాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 3 వేల వరకు పెంచామని జగన్ తెలిపారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని తొలగించి వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికుల తరఫున పోరాడుతామని, వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే బకాయిపెట్టిన వారి జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు వారి జీతాలను కూడా పెంచాలని అన్నారు.

# భాగ్యరాజ్ మృతిపై పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుందని వ్యాఖ్య భారతీయ చలనచిత్ర పరిశ్రమలో, ముఖ్యంగా కోలీవుడ్‌లో ఒక అద్భుతమైన శకం ముగిసింది. తన విలక్షణమైన స్క్రీన్‌ప్లే మ్యాజిక్‌తో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన ప్రముఖ దర్శకుడు, నటుడు, రచయిత కె. భాగ్యరాజ్ ఈ ఉదయం చెన్నైలో కన్నుమూశారు. ఆయన మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భాగ్యరాజ్ గారు కేవలం దర్శకుడే కాదు... 'స్క్రీన్‌ప్లే కింగ్'గా ఇండియన్ సినిమాలో చెరగని ముద్ర వేశారని పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. ఒక సాధారణ సహాయ నటుడిగా, రచయితగా సినీ ప్రస్థానం ప్రారంభించిన భాగ్యరాజ్.. ఆ తర్వాత తమిళ ఇండస్ట్రీలో టాప్ డైరెక్టర్‌గా, హీరోగా తనదైన ముద్ర వేశారన్నారు. చిత్ర రంగంలో భాగ్యరాజ్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన కథ, స్క్రీన్‌ప్లే అందించిన ఎన్నో క్లాసిక్ సినిమాలు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో రీమేక్ అయి విజయాలు అందుకున్నాయని కొనియాడారు. ప్రేమ, మధ్యతరగతి కుటుంబాల ఎమోషన్స్, హ్యూమర్‌ను సరికొత్తగా మిక్స్ చేస్తూ ఆయన సినిమాలు మలిచిన తీరు ఒక తరం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని పవన్ అన్నారు. మన పక్కింటి అబ్బాయిలాంటి పాత్రలతోనే ఆయన మెప్పించారన్నారు. ఈ విషాద సమయంలో భాగ్యరాజ్ కుటుంబ సభ్యులకు (భార్య పూర్ణిమ, కుమారుడు శాంతను, కుమార్తె శరణ్య) భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# సంజీవనితో ఆరోగ్య సేవలు మరింత సులభం

తాను కూడా జెన్ జీనే అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్తును ముందుగానే ఊహించి, దానికి అనుగుణంగా టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నానని తెలిపారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో మన యువత నిష్ణాతులు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సాంకేతిక దార్శనికతకు ప్రతిరూపంగానే రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరెటివ్ విధానం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని భరోసా ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపైకి తెస్తామన్నారు. సంజీవని కార్డు ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ వైద్య సేవలు, ఆరోగ్య పర్యవేక్షణ సులభతరం అవుతాయని వివరించారు. ప్రజలు కూడా మంచి ఆహారపు అలవాట్లు, యోగా, వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

# సౌదీ ప్రయాణికులకు అలర్ట్: బంగారంపై కొత్త నిబంధనలు



సౌదీ అరేబియాకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆ దేశ ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. మనీలాండరింగ్ నిరోధక చర్యల్లో భాగంగా బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు రవాణాపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో ఉన్న 60,000 సౌదీ రియాల్స్ డిక్లరేషన్ పరిమితిని ప్రస్తుతం 40,000 రియాల్స్‌కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. సౌదీ అరేబియాలోని జకాత్, ట్యాక్స్ అండ్ కస్టమ్స్ అథారిటీ ఈ కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. దీని ప్రకారం, ఎవరైనా 40,000 సౌదీ రియాల్స్ (సుమారు రూ. 10 లక్షలు) లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదు, బంగారం, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలు తీసుకెళుతున్నట్లయితే కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. వీటికి సంబంధించిన కొనుగోలు ఇన్‌వాయిస్‌లను కూడా అధికారులకు చూపించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సరైన వివరాలు వెల్లడించని పక్షంలో, సదరు వస్తువులను 72 గంటల పాటు తాత్కాలికంగా జప్తు చేస్తారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన వారికి (మనీ లాండరింగ్ ఉద్దేశం లేదని నిర్ధారణ అయితే), స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువలో 10 నుంచి 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. ఈ ఉల్లంఘన పునరావృతమైతే జరిమానాను 50 శాతానికి పెంచే అవకాశం ఉంది. ఒకవేళ నేరపూరిత ఉద్దేశాలు ఉన్నట్లు అనుమానిస్తే, సదరు కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేస్తారు. ఈ కొత్త నిబంధనలు భారత్ సహా ఇతర గల్ఫ్ దేశాలకు ప్రయాణించే ప్రవాసులపై ప్రధానంగా ప్రభావం చూపనున్నాయి. ప్రయాణికులు తమ వెంట తీసుకెళ్లే విలువైన వస్తువులకు సంబంధించిన అసలు రశీదులను భద్రపరుచుకోవాలని మరియు ప్రయాణానికి ముందు తాజా నిబంధనలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో సిద్ధార్థ నాయుడు.

*-24 వ వార్డు శంకర్ నగర్ లో సర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం.*





ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని 24వ వార్డు శంకర్ నగర్ ప్రాంతంలో నిర్వహించిన సర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో, ఆదోని నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మరియు యువ నాయకులు సిద్ధార్థ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా పరిశీలన, ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న డిఎల్‌ఓ అధికారులతో, ప్రజలతో, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో మాట్లాడి వెరిఫికేషన్ ప్రక్రియ ఎలా జరుగుతోందో తెలుసుకున్నారు. అలాగే, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా, వెరిఫికేషన్ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా డిఎల్‌ఓ అధికారులు, ఓటర్లకు మరియు ప్రజలకు ఎలాంటి సందేహాలు లేదా సమస్యలు ఉన్నా నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తాము అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు వీరేష్, బసవరాజు, వీరేష్, మల్లికార్జున, ఈరన్న, శ్రీరాములు, జగదీష్, తుమ్మల ఈరన్న, విజయ్, హుసేని, శివరాములు, రాజశేఖర్, మాధవ్,మరియు. జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు రెండు చుక్కలు పల్స్ పోలియో.

**- ఐదు సంవత్సరాలు లోపు చిన్నారులకు అందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలి.**
**- మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్.**




ఆదోని (పల్లె వెలుగు): ఆదివారం జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి అందరూ నిబద్ధత పనిచేసి అన్ని శాఖల వాళ్ళు సహకారంతో విజయవంతం చేయాలని ఆదోని మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్ మరియు డిప్యూటీ ఎంహెచ్ఓ అధికారి ఎమ్ వి సత్యవతి ఈ ఉదయం జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించి పల్స్ పోలియో కార్యక్రమం గురించి తెలియజేశారు ఈ ర్యాలీ యందు ఆదోని మునిసిపల్ పరిధిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మరియు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు ఆదోని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.మంజునాథ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ఆదోని పట్టణంలో ఉన్న 39,000 మంది ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ మరియు అప్పుడే పుట్టిన శిశువులకు కూడా రేపు ఆదివారం పోలియో చుక్కలు వేయించాలని బూతులలో పిల్లలను తీసుకెళ్లి పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని తల్లిదండ్రులని కోరారు.

## ఓబీసీ మోర్చా మండలం-1 అధ్యక్షునిగా రాఘవేంద్ర.

**ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ వాల్మీకి పార్థసారథి సమక్షంలో ఎన్నిక.**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం-01, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షునిగా ఎన్నికైన కె. రాఘవేంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు.?ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మరియు కర్నూలు జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ఏవి సురేష్, ఆదోని మండలం-01 మండల అధ్యక్షులు ఉష రాజు, ఆదోని మండలం -02 గోపి,మరియు ఓబీసీ మోర్చా నాయకులు పాల్గొని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కే రాఘవేంద్ర ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోపి శ్రీనివాస్, కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ పరమహంస కర్నూలు జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఉల్చాల లక్ష్మయ్య నాయుడు ప్రతి ఒక్కరు ధన్యవాదాలు తెలపడం జరిగినది, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ వాల్మీకి పార్థసారథి నాయకత్వంలో మన ఓబీసీ మోర్చా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నాము.

## సీఎం పర్యటన వేళ ట్రాఫిక్ ఆంక్షలు



మహానంది, పల్లె వెలుగు ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం జిల్లా గిద్దలూరు మండలం కృష్ణం శెట్టిపల్లె పర్యటనకు వస్తున్న నేపథ్యంలో మహానంది మండలంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే వాహనాలకు ముందస్తు అనుమతి ఉంటే తప్ప ముందుకు సాగనివ్వలేదు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ ఆంక్షలు విధించినట్లు మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మండలంలోని బోయలకుంట్ల మెట్ట-ఆంజనేయపురం వద్ద పోలీసులు భారీగేట్లు ఏర్పాటు చేసి వాహనాలను నిలిపివేశారు. సీఎం పర్యటన అనంతరం వాహనాల రాకపోకలు యధావిధిగా సాగాయి.

### ముస్లిం స్వాతంత్ర సమరయోధుల

## చరిత్రను విద్యార్థులకు చేరవేసిన అల్ మేవా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ముస్లిం



స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను విద్యార్థులకు చేరవేసిన ఆల్ మేవా, ఏపీ భారత స్వాతంత్ర్య సమరంలో హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ తదితర అన్ని వర్గాల మహనీయులు భుజం భుజం కలిపి పోరాడి తమ ప్రాణాలను అర్పించి దేశానికి స్వేచ్ఛను సాధించి పెట్టారని, అయితే ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల సేవలు నేటి విద్యార్థులకు తగిన స్థాయిలో పరిచయం కాలేదని ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన భారత ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల "నేమ్ స్టిక్కర్లను", ప్రముఖ దాత "జనాబ్ ఎం.బి.టి. బాబు" సహకారంతో నంద్యాలలోని "కె.ఎన్.ఎం. మున్సిపల్ హైస్కూల్" విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని శనివారం ఉదయం ప్రార్థనలో నిర్వహించారు. ఈ స్టిక్కర్లలో మొహమ్మద్ ఉల్లాహ్ మొహిదీన్, మేజర్ జనరల్ షా నవాజ్ ఖాన్, కులుసుం సయాని, కాకా బాబు ముజఫర్ అహ్మద్, హజరత్ బిబి ఇస్మాయిల్, మొహమ్మద్ గౌస్ బేగ్, హకీమ్ అజ్మల్ ఖాన్, డాక్టర్ ముక్తార్ అహ్మద్ అన్సారీ, మౌలానా మజహారుల్ హక్, సయ్యద్ బద్రుల్ హసన్, మౌలానా మొహమ్మద్ అలీ జోహార్ , మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ తదితర ప్రముఖ ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలతో పాటు, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వారు చేసిన త్యాగాలు, విశిష్ట సేవలను సంక్షిప్తంగా పొందుపరిచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను సంపూర్ణంగా తెలుసుకోవాలంటే అన్ని వర్గాల



స్వాతంత్ర్య సమరయోధుల సేవలను విద్యార్థులకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చరిత్రను తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, రాజ్యాంగ విలువల పట్ల గౌరవం మరియు దేశసేవ పట్ల స్ఫూర్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. ఇది కేవలం స్టిక్కర్ల పంపిణీ కార్యక్రమం మాత్రమే కాదని, స్వాతంత్ర్య వీరుల త్యాగాలను భావితరాల హృదయాల్లో నిలిపే ఒక దేశభక్తి చైతన్య కార్యక్రమం అని వారు అభివర్ణించారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షులు ఇమ్రాన్ పాషా, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్. మహమ్మద్ అబులైస్, నంద్యాల జిల్లా అధ్యక్షులు సయ్యద్. మహమ్మద్ ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఘౌస్, సిరివెళ్ల అల్మేవ వైస్ ప్రెసిడెంట్ కె . అహ్మద్ హుస్సేన్, కరాటే మాబ్బాష తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి : కమిషనర్ చల్లా ఓబులేసు

**- 5 ఏళ్లలోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోవాలి**
**- నగరంలో 82,964 మంది చిన్నారుల కోసం 229 కేంద్రాలు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. నగర పరిధిలో 82,964 మంది 5 ఏళ్లలోపు చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని, వారి కోసం 229 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో వ్యాధి చిన్నారుల్లో శాశ్వత వైకల్యానికి కారణమవుతుందని, అయితే పోలియో చుక్కలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి సారి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ముఖ్యమని తెలిపారు. గతంలో పోలియో టీకాలు వేయించినప్పటికీ, ఈ విడతలో కూడా తప్పనిసరిగా చుక్కలు వేయించాలని సూచించారు. ఎవరైనా బూత్‌లకు రాలేని పక్షంలో జూన్ 29, 30 తేదీల్లో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తాయని తెలిపారు. నగరంలోని ప్రతి చిన్నారి పోలియో చుక్కలు పొందేలా తల్లిదండ్రులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

## ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి: జేసీ నూరుల్ ఖమర్

**● నేటి నుంచి 30 వరకు జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ● 3,52,164 మంది చిన్నారుల గుర్తింపు.. 1,630 బూత్‌ల ఏర్పాటు ● ఘనంగా పల్స్ పోలియో అవగాహన ర్యాలీ**




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జిల్లాలో ఆదివారం (జూన్ 28) నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉండాలని కోరారు. శనివారం కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..

**మూడు రోజుల కార్యాచరణ ఇదే:**

జూన్ 28 (ఆదివారం): జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేస్తారు.

జూన్ 29, 30 (సోమ, మంగళవారాలు): ఆదివారం నాడు ఏదైనా కారణంతో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించి, వైద్య సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారు.

**అధికారులకు పక్కా ఆదేశాలు -- 1,630 బూత్‌ల ఏర్పాటు:**

జిల్లాలో మొత్తం 3,52,164 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, ఒక్కరు కూడా పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు మూడు దశల్లో కొనసాగుతుందని వివరించారు. తప్పిపోకుండా వారందరికీ పోలియో చుక్కలు వేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 1,630 పల్స్ పోలియో బూత్‌లను సిద్ధం చేసినట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ సామాజిక బాధ్యతగా భావించి తమ సమీపంలోని బూత్‌లకు పిల్లలను తీసుకెళ్లి చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

**ఉత్సాహంగా సాగిన అవగాహన ర్యాలీ:**

కలెక్టరేట్ కార్యాలయం నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. "పోలియో రహిత సమాజం-మన అందరి లక్ష్యం" అనే నినాదాలతో జాయింట్ కలెక్టర్, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఎంహెచ్వో డాక్టర్ భాస్కర్, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఓటరు జాబితాల ప్రక్షాళనకు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

- మాధవినగర్ క్యాంపు కార్యాలయంలో 'హ×='పై అవగాహన సమీక్ష
- హాజరైన యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్క ఓటరు పాత్ర ఎంతో కీలకమని పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరితా రెడ్డి పేర్కొన్నారు. మాధవినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కల్లూరు అర్బన్ 16వ వార్డు ఇంచార్జ్‌లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (హ×=) కార్యక్రమంపై ఆమె అవగాహన రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు జాబితాల ప్రక్షాళన, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, నకిలీ ఓటర్ల తొలగింపు వంటి అంశాలపై నియోజకవర్గంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకతను తీసుకురావడమే 'హ×=' ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు, వార్డు ఇంచార్జ్‌లు క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఓటరు నమోదు ప్రక్రియపై వార్డు ఇంచార్జ్‌లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, వార్డు ప్రతినిధులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరావతి నగర్ వార్డు అభివృద్ధే మా లక్ష్యం.

**మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ.**





ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతి నగర్ కాలనీలో ఈరోజు 72 లక్షల రూపాయల వ్యయంతో మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా లలితమ్మ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి సహాయ సహకారాలతో గత తొమ్మిది నెలల కాలములో దాదాపు ఒక కోటి డెబ్బై లక్షల రూపాయల వ్యయముతో సిసి డ్రైనేజీలు, బిసి రోడ్లు మరియు మహిళల కోసం సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని లలితమ్మ వివరించారు. కనుక అమరావతి నగర్ వార్డు అభివృద్ధి చెందాలి అంటే ఎమ్మెల్యే డాక్టర్ పివి పార్థసారథి అండదండలతో పాటుగా పెద్దాయన టిడిపి ఇంచార్జీ మీనాక్షీ నాయుడు, జనసేన ఇంచార్జీ మల్లప్ప ఆశీస్సులతో పోటీ చేసే కూటమి అభ్యర్థి ఎవరైనా సరే గెలిపించుకోవాలని అప్పుడే అమరావతి నగర్ వార్డు అభివృద్ధి చెందుతుందని కాదని పొరపాటున వైసిపి అభ్యర్థిని గెలిపించుకుంటే అమరావతి నగర్ కాలనీ అభివృద్ధిని గాలికి వదిలేసి ఎర్రిస్వామి ఇంటికి కాపలాదారుగా మిగిలిపోతాడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గతములో ఈ వార్డులో గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు కూడా ఎర్రిస్వామి పెట్టే ఇబ్బందులు భరించలేకనే పార్టీలు మారారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కనుక అమరావతి నగర్ వార్డు అభివృద్ధి కోసం మంచిగా ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు వెల్లాల మధుసూధనశర్మ, పరుశురాం, చరణ్, తిక్కన్న , పవన్, రవి తిరుమల, రాజు, జంబన్న సాయి, చిన్న, రాజేష్ మొదలైన నాయకులు, మున్సిపల్ ఏఈ భువన చంద్రారెడ్డి,వలి, సచివాలయం సెక్రటరీ అపర్ణ, అధికారులు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# ఆ నాలుగు గంటలు నరకం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 27 : ఒకటి కాదు... రెండు కాదు.... ఏకంగా నాలుగు గంటలు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడంతో వినియోగదారులు నరకాన్ని చవిచూశారు. ఓవర్ లోడ్ పేరుతో విద్యుత్ శాఖ పల్లె ప్రాంతాలలో సరఫరాను నిలిపివేస్తూ ఉండటంతో ప్రజలు ఆ శాఖపై అక్కసు వెళ్ళబోస్తున్నారు. బండి ఆత్మకూరు మండలంలో శుక్రవారం రాత్రి 10 గంటల నుండి శనివారం తెల్లవారుజామున రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మెయిన్ సప్లై పేరుతో సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ట్రాన్స్కో అధికారులు సాకు చెబుతున్నారు. నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో వినియోగదారులు ఉక్కపోతతో దోమలతో సహవాసం చేశారు. బండి ఆత్మకూరు మండలంలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడినప్పటికీ, నంద్యాలలో మాత్రం సరఫరాలో అంతరాయం లేకపోవడంతో విద్యుత్ అధికారులు హాయిగా కునుకు తీశారు. పట్టణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఇచ్చి, పల్లె ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంలో అధికారులు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని విద్యుత్ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రాంత వాసులే ప్రజలా? పల్లె ప్రాంతాలలో నివసిస్తున్న వారు ప్రజలు కారా? అంటూ వినియోగదారు ప్రశ్నిస్తున్నారు. అందరి మాదిరిగానే పల్లె ప్రాంతాల ప్రజలు ప్రతినెల విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నప్పుడు సరఫరాను నిలిపివేయడంలో అధికారులు పక్షపాత ధోరణి ని అవలంబిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంటా గంటన్నర అయితే పర్వాలేదు... ఏకంగా నాలుగు గంటల పాటు మెయిన్ సప్లై పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**మరమ్మతుల పేరుతో సరఫరా నిలిపివేత**

మరమ్మతుల పేరుతో విద్యుత్ శాఖ అధికారులు గత నాలుగు రోజుల నుండి బండి ఆత్మకూరులో అర్ధాంతరంగా సరఫరాను నిలిపివేస్తున్నారు. ఈ విషయంలో వినియోగదారులకు విద్యుత్ శాఖకు చెందిన అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వడం లేదు. విద్యుత్ సరఫరా నిలిచిపోయేందుకు ఆ శాఖ అధికారులు కారణభూతులవుతున్నారు. చిన్నచిన్న వర్షాలకే, గాలి వానలకు విద్యుత్ స్తంభాలు విరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల నేల వారితో ఉన్నాయి. స్తంభాలను ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఘాటుగా విమర్శిస్తున్నారు. స్తంభాలను ఏర్పాటు చేయడంలో సరియైన ప్రమాణాలను పాటించకపోవడం వల్ల, విద్యుత్ స్తంభాలు నేలకు ఒరుగుతూ ఉన్నాయి. నాణ్యతలేని స్తంభాలను ఏర్పాటు చేస్తూ ఉండటం వల్ల, చిన్నపాటి గాలికే స్తంభాలు మధ్యలో విరిగిపోతున్నాయి.

# మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడి వ్యాపారవేత్తలుగా ఎదగాలని డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ( ఆర్ ఎస్ ఈ టి ఐ) నంద్యాల నందు నిర్వహించిన 'వ్యాపార అభివృద్ధి శిక్షణా కార్యక్రమం' ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్డిఎ పిడి శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వం కల్పిస్తున్న ఎం యు డి ఆర్ ఏ, పి ఎం ఈ జి పి, పి ఎం ఎఫ్ ఎం ఈ వంటి పథకాల ద్వారా మహిళలు సూక్ష్మ, చిన్న పరిశ్రమలు స్థాపించుకోవాలన్నారు. తద్వారా కుటుంబానికి ఆసరాగా నిలవడమే కాకుండా, మరో పది మందికి ఉపాధి కల్పించి నిరుద్యోగ సమస్య నివారణకు తోడ్పడాలి" అని సూచించారు. బ్యాంక్ రుణాలను సక్రమంగా వినియోగించుకొని వ్యాపారంలో నిలదొక్కుకోవాలని తిరిగి రుణాలు చెల్లించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ ఈ టి ఐ డైరెక్టర్ శ్రీమతి అరుణ కుమారి, శిక్షణా సమన్వయకర్తలు శివ నారాయణ, రమేష్, సంస్థ సిబ్బంది మరియు శిక్షణార్థులు పాల్గొన్నారు.



# యాప్ ద్వారా నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ఎరువులు



దొర్నిపాడు జూన్ 27 పల్లె వెలుగు న్యూస్ రైతులు సాగుచేసిన పంటలకు ఎరువుల కొరత లేకుండా అందరికీ అందే విధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా నమోదు చేసుకున్న ప్రతి రైతుకు పంట నమోదును బట్టి ఎరువులు అందజేస్తామని మండల వ్యవసాయఅధికారిని ప్రమీల అన్నారు దొర్నిపాడు మండలంలోని కొత్త పల్లె గ్రామం లో రెండు రోజుల నుండి రైతులకు అవసరమైన యూరియ డి,ఏ,పిబస్తాలనుఏఈ ఓ,లురిజ్వాన,సాయినాథరెడ్డివి,ఏ ఏ శేఖరు పంపిణీ చేస్తున్నట్లు ఏ,వో తెలిపారు, ఈసందర్భంగాఆమె మాట్లాడుతూ కొత్త పల్లె గ్రామానికి ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన 532 బస్తాల యూరియ 400 బస్తాల డి ఎ పి ఎరువులను రైతులకు అందజేస్తున్నామన్నారు యూరియ318మంది రైతులకు డిఏపి 323 మంది రైతులకు శనివారం పంపిణీ చేశారన్నారు, మిగతా రైతులందరికీ కూడా అందిస్తామన్నారుఏపంటనుసాగుచేస్తేఆపంటవివరాలతో పంట నమోదుచేసుకున్న ప్రతి రైతుకుఎరువులుఅందిస్తామన్నారు,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదనిఆమెతెలిపారు,యూరియ బస్తా270డిఎ,పి1350 రూపాయలకుఅందజేస్తున్నామన్నారు ,ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

# పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ..

పాణ్యం జూన్ 27 పల్లె వెలుగు : మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



పాణ్యం-2 ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనిపై శనివారం మండలంకేంద్రంలో పలు వీధులలో అవగాహన ర్యాలీ చేపట్టారు. 0 - 5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్య సిబ్బంది ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సిహెచ్ఓ నాగలక్ష్మి మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ -2 పరిధిలో మొబైల్ బృందాల ద్వారా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సురేఖ,ఆశా వర్కర్లు రామేశ్వరి,సుబ్బ రత్నమ్మ,లక్ష్మీదేవి,సరళ కుమారి పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం మసీదుపురం గ్రామంలో విద్యుత్ ఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఇటీవల ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి కాకునూరు ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తి పొలంలో కరెంట్ వైర్ తెగిపడింది. ముత్యాల కరుణక్కకు చెందిన గేదె ఆ ప్రాంతంలో గడ్డి మేసేందుకు వెళ్లి విద్యుత్ ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. చనిపోయిన గేదె విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరారు.

## వి, బి ,జి ,రాంజీ పథకం కింద కొబ్బరి మొక్కలు పంపిణీ



దొర్నిపాడు జూన్ 27 పల్లె వెలుగు న్యూస్ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ యోజన పథకం కింద దొర్నిపాడు మండలానికి మంజూరైన 1849 కొబ్బరి మొక్కలనుశనివారం రైతుల కు అందజేసినట్లు ఏ పీ ఓ అనీఫా తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వము రైతులకు ఉచితంగా కొబ్బరి మొక్కలు అందజేయడంతో పాటు వాటి సంరక్షణఖర్చులను కూడా ప్రభుత్వమే అందజేస్తుందని ఆమె అన్నారు,కొబ్బరిమొక్కలసాగుమంచిలాభాలను తెచ్చిపెడుతుందని ఆమెఅన్నారు, మూడు ఎకరాల లోపు ఉన్న ప్రతి రైతుకు మొక్కలను అందిస్తామని ఆమె తెలిపారు, టెక్నికల్ అసిస్టెంట్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 30 మంది రైతులు 28 ఎకరాలలో నాటేందుకు కొబ్బరి మొక్కలను అందజేసినట్లు ఆయన తెలిపారు,అర్జునాపురం గ్రామానికి 60 కొబ్బరి మొక్కలు అమ్మి రెడ్డి నగర్ 20 కొండాపురం 60 రామచంద్రాపురం 60 కొత్తపల్లి 120 దొర్నిపాడు 290 మొక్కలు క్రిష్టిపాడుకు127 చాకరాజు వేములకు 234 గోవిందిన్నేకు 334 గుండుపాపల గ్రామ రైతుకు 325 కొబ్బరి మొక్కలను అందజేసినట్లు ఆయన తెలిపారు, మొక్కలు తీసుకున్న ప్రతి రైతు పొలాల గట్లపై నాటుకున్నట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో టిఏలు జయ భారతి రెడ్డి శ్రీనివాసులు, రవి ప్రసాద్ రెడ్డి ఎఫ్ఏ లు అత్తార్ బాషా శివకోటిరెడ్డి, నాగేశ్వరమ్మ, విక్రమ్ మురళి ,సురేష్, బాబు సుబ్బరాయుడు సురేష్ రైతులు ఉపాధి కూలీలు పాల్గొన్నారు



# పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎంపీ బస్తిపాటి నాగరాజు

- 8 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- అర్హులందరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పేదల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని కర్నూలు పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) బస్తిపాటి నాగరాజు స్పష్టం చేశారు. మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో గల తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 8 మంది లబ్ధిదారులకు సంబంధించిన చెక్కులను శనివారం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులను ఎప్పటికప్పుడు త్వరితగతిన విడుదల చేస్తోందని కొనియాడారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ (ఐజమీూ) చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ కుమార్ తదితర నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యూరియా, డీఏపీ ఎరువులతో లింక్ ప్రొడక్టులు విక్రయించరాదు

-- జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో ఈరోజు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎరువుల తయారీ సంస్థల అధికారులు, హ్యాండ్లింగ్ ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎరువుల కంపెనీలు యూరియా మరియు డీఏపీ ఎరువులతో ఎటువంటి లింక్ ప్రొడక్టులను జతచేసి విక్రయించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే రేక్ పాయింట్ నుంచి ఎరువుల డీలర్లకు సరఫరా చేసే సమయంలో తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు..అదేవిధంగా, డీలర్లు గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ)కు మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా ఎరువుల సరఫరా జరగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, డీలర్లు ఎరువులను అవసరమైన ప్రాంతాలకు మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ ఫర్టిలైజర్ కంపెనీల సేల్స్ అధికారులు, హ్యాండ్లింగ్ ఆపరేటర్లు, నంద్యాల వ్యవసాయ అధికారి ప్రసాదరావు, మార్క్ఫెడ్ అధికారి హరినాథ్ రెడ్డి ,సాంకేతిక వ్యవసాయ అధికారి కళ్యాణ్ కుమార్, ఏఈఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాపిలీలో ఘనంగా ముగిసిన మొహరం వేడుకలు







పల్లె వెలుగు -?ఫ్యాపిలీ మండల పరిధిలోని ఫ్యాపిలీ గ్రామంలో గత కొన్ని రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న మొహరం వేడుకలు శనివారం అత్యంత వైభవంగా ముగిశాయి. కులమతాలకు అతీతంగా సాగిన ఈ వేడుకల ముగింపు రోజున భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ?వేడుకల ముగింపు సందర్భంగా గ్రామంలో ఖాజా బందే నవాజ్ స్వామి, గుడిమిరాళ్ల స్వామి, దస్తగిరి స్వామి పీర్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వాములకు చక్కెరను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో హిందూ, ముస్లింలు కలిసికట్టుగా పాల్గొనడం ఇక్కడి మత సామరస్యానికి అద్దం పట్టింది. సుదూర ప్రాంతాల నుండి సైతం భక్తులు తరలివచ్చి స్వామివార్ల ఆశీస్సులు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీర్ల నిమజ్జనంతో ఈ ఏడాది మొహరం వేడుకలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

# పులివెందులలో కిరాతకం : 4 ఏళ్ళ విశ్వబ్రాహ్మణ చిన్నారి 'నిత్విక' దారుణ హత్య!

**పక్కింటి దంపతుల అమానుషం.. వాటర్ డ్రమ్ములో తలకిందులుగా ముంచి, మూతపెట్టి ఉద్దేశపూర్వక మర్డర్!**
**నిందితులకు కొమ్ముకాస్తున్న బంధువర్గం.. బాధితులకు అండగా నిలిచిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ!**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో.. మానవత్వం మంటగలిసేలా, కఠిన హృదయులు సైతం కన్నీరు పెట్టేలా పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లోపత్నుతల గ్రామంలో ఒక ఘోర కలియుగ విపత్తు చోటుచేసుకుంది. 4 సంవత్సరాల అమాయక పసిగుడ్డు అని కూడా చూడకుండా, పాత కక్షలను మనసులో పెట్టుకొని పక్కింటి దంపతులు ఒక చిన్నారిని అత్యంత క్రూరంగా వాటర్ డ్రమ్ములో ముంచి హత్య చేసిన ఉదంతం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

**కన్నప్రేమ తల్లడిల్లింది.. కక్షతో పసిప్రాణం బలైంది!**

గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ కులస్థులు నాగవేటి రామాచారి, సుజనా గార్ల కుమార్తె నిత్విక (4) గురువారం (26/06/2026) సాయంత్రం 5 గంటల సమయంలో ఆడుకోవడానికి బయటకు వెళ్ళింది. ఎంతసేపటికీ పాప తిరిగి రాకపోవడంతో, ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల అంతా గాలించినా ఆచూకీ లభించలేదు. అయితే, గతంలో పక్కింటి ఆవిడ స్వాతితో జరిగిన ఒక చిన్న గొడవను మనసులో పెట్టుకొని, అత్యంత ఉద్దేశపూర్వకంగా, కోపం-ఆవేశంతో పక్కింటి స్వాతి మరియు ఆమె భర్త వెంకటరామిరెడ్డి దంపతులు కలిసి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఆ పసి ప్రాణిని వాటర్ డ్రమ్ములో తలకిందులుగా వేసి, శ్వాస ఆడకుండా పైన మూత పెట్టేసి క్రూరంగా హత్య చేశారు.

**నిందితుల అండ చూసి ఊరుకోం -- కమ్మరి పార్వతమ్మ సింహగర్జన!**

ఈ దారుణ ఘాతుకం వెలుగుచూసిన తర్వాత నిందితులు స్వాతి, వెంకటరామిరెడ్డి మరియు వారి బంధువర్గం అంతా ఒకటై, బాధితుడైన రామాచారి కుటుంబానికి అన్యాయం చేయడానికి, కేసును పక్కదారి పట్టించడానికి తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయాన్ని లోకల్ సంఘ నాయకులు మరియు కన్నవారి ద్వారా తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి కమ్మరి పార్వతమ్మ తక్షణమే స్పందించారు.

*"మా విశ్వబ్రాహ్మణ బిడ్డకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం! నిందితులు ఎంతటి వారైనా, ఎంతటి రాజకీయ, అంగబలం ఉన్నవారైనా సరే చట్టం ముందు మోకరిల్లాల్సిందే. బాధితులకు న్యాయం జరిగేంతవరకు రాష్ట్ర కార్పొరేషన్ తరపున, ప్రభుత్వం తరపున అండగా ఉంటాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వబ్రాహ్మణులంతా లోపత్నుతల గ్రామానికి తరలిరావాలి." అని ఆమె పిలుపునిచ్చారు.*

**మంత్రి, ఎస్పీలతో రంగంలోకి చైర్‌పర్సన్:**

బాధితులకు తక్షణ న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తూ కమ్మరి పార్వతమ్మ తక్షణమే సదరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ (రా×) గారితో మాట్లాడారు. నిందితులు ఎంత పెద్దవారైనా కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ గార్లతో, కడప జిల్లా ఎస్పీ షెల్కే నచ్చికేత్ విశ్వనాథ్ ఖూూ గార్లతో ఫోన్ ద్వారా సుదీర్ఘంగా మాట్లాడి నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చూడాలని, బాధితులకు తగిన న్యాయం చేయాలని వివరించారు.

**ప్రత్యక్ష సాక్షులను బెదిరిస్తే ఖబడ్దార్!**

అనంతరం లోపత్నుతల గ్రామానికి చేరుకున్న కమ్మరి పార్వతమ్మ చిన్నారి నిత్విక భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాల వేసి కన్నీటి నివాళులర్పించారు. అక్కడే ఉన్న సీఐ (ఐ×) శ్రీరామ్, సీఐ (ఐ×) శాంతి లాల్ నాయక్ గార్లతో నేరుగా మాట్లాడి, "పాపని నీటి డ్రమ్ములో తలకిందులుగా ముంచి మర్డర్ చేయడమే కాకుండా, ఈ దారుణాన్ని చూసిన సాక్షులను కూడా నిందితులు బెదిరిస్తున్నారు. సాక్షులకు మరియు పాప తల్లిదండ్రులకు తగిన రక్షణ, న్యాయం కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది" అని హెచ్చరించారు. బాధిత తండ్రి నాగవేటి రామాచారిని పరామర్శించి ధైర్యం చెబుతూ.. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, పోలీసుల నుండి స్పష్టమైన హామీ తీసుకున్నామని, న్యాయం జరిగే వరకూ తాము పోరాడుతామని భరోసా ఇచ్చారు.

**న్యాయపోరాటంలో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు వడ్ల శ్రీనివాస్ ఆచారి, కుర్లపల్లి రంగాచారి, అనంతపురం బీసీ సంఘం అధ్యక్షులు వీబీ భాస్కర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా నాయకులు బ్రహ్మశ్రీ డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ, నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అగర సుబ్రహ్మణ్య ఆచారి, జీకే ఆనంద్, కమ్మరి రామాచారి, దేవ పూజ ధనుంజయ ఆచారి, మద్దిలేటి ఆచారి, పులివెందుల నియోజకవర్గ అధ్యక్షులు మాధవాచారి, మాజీ కౌన్సిలర్ చంద్ర ఆచారి, భైరవాచారి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారి కుటుంబానికి మద్దతుగా నిలిచారు.

# వ్యర్థాల సమర్థ నిర్వహణతో ప్రజారోగ్య పరిరక్షణ

● కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ● ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ విధానాలు అవలంబించాలి





పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : పట్టణాల్లో ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. 'స్వచ్ఛాంధ్ర మిషన్'లో భాగంగా ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణపై కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన పట్టణాల సానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో నిర్వహించారు. సాహస్, వాష్ సంస్థల ప్రతినిధులతో కలిసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్--2026 మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, వర్గీకరించడం, శుద్ధి చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. తడి, పొడి వ్యర్థాలను మూలం వద్దే వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం వంటి చర్యలు పరిశుభ్రమైన నగర నిర్మాణానికి దోహదపడతాయని వివరించారు. అలాగే వ్యర్థాల నిర్వహణలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణను పటిష్టంగా అమలు చేయడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని ఏర్పరచవచ్చని తెలిపారు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, బేతంచెర్ల కమిషనర్ హరిప్రసాద్, సాహస్ సంస్థ పీఎంయూ కోఆర్డినేటర్ అర్జున్ శర్మ, రిసోర్స్ పర్సన్స్ నీలిమా రెడ్డి, నర్మద, కోఆర్డినేటర్ జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముల వద్ద ఏర్పాటు చేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి చేపట్టే రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు, 24/7 సర్వేలెన్స్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్న విషయాన్ని వారు సమగ్రంగా సమీక్షించారు. అదే విధంగా గోదాము పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేసి తనిఖీలను అధికారికంగా నమోదు చేశారు. ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భద్రతా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తాసిల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ కలెక్టర్ వెంట వున్నారు. అలాగే రాజకీయ పార్టీల తరపున ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి సయ్యద్ రియాజ్ భాష, టిడిపి పార్టీ ప్రతినిధి శివరామిరెడ్డి, వైయస్సార్సీపి పార్టీ ప్రతినిధి సాయిరాం రెడ్డి, బిజెపి పార్టీ ప్రతినిధి కె.చంద్రశేఖర్, బిజెపి పార్టీ ప్రతినిధి నరసింహ, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్ కుమార్ హాజరై పర్యవేక్షణలో పాల్గొన్నారు.



# ఆర్థిక ప్రణాళికలు ఆర్థిక విధానాల రూపకల్పనలో గణాంకాలే దిక్సూచి

పల్లె వెలుగు:మానవ అభివృద్ధిలో గణాంకాలు ముఖ్య పాత్ర పోషిస్థాయి. కేంద్ర' రాష్ట్ర



స్థానిక.ప్రభుత్వాలు అభివృద్ధి ప్రణాళికలు స ౦ ే క ్ష వ ు పథకాలుఆర్థికవిధానాలరూపకల్పనలోగణాంకాల ు దిక్సూచిగా పనిచేస్తాయి. కేంద్ర' రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ కేటాయింపు పెట్టుబడులు స్థాయిని నిర్ణయించడానికి ఆధునిక ప్రభుత్వాలకుగణాంకాలుఅవసరం.ఖచ్చితమైన డాటా కనుగొనడానికి గణాంకాలుఉపయోగపడుతా ఈ.ఉదాహరణకు 10 సంవత్సరాలలో జనాభా పెరుగుదల తెలియాలంటే గణాంకాలు డాటాను చూడవలసిందే.29 జూన్ జాతీయ గణాంకాల దినోత్సవంలి

*గణాంక ఆర్థిక ప్రణాళిక రూపకల్పనలో ప్రొఫెసర్ కీర్తి' శేలు ప్రశాంత చంద్ర మహలనోబిస్ స్వాతంతంత్ర అనంతరం ఆర్థిక ప్రణాళికా మరియు గణాంక అభివృధి రంగాలకు ఆయన చేసిన గణనీయమైన విశేష సేవలకు కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూన్ 29వ తేదీని ఆయన జయంతిని భారత ప్రభుత్వం గణాంకాల దినోత్సవంగా ప్రకటించింది.సామాజిక ఆర్థిక ప్రణాళిక మరియు ఆర్థిక యాజమాన్య విధాన రూపకల్పనలో గణాంక శాస్త్రం యొక్క పాత్ర ప్రాముఖ్యత గురించి ప్రొఫెసర్ మహలనోబిస్ నుండి ప్రేరణ పొందడానికి యువతరంలో గణాంక శాస్త్రం పై అవగాహన కల్పించడం సదస్సులు సమావేశాలు చర్చలు ఏర్పాటు చేయడం గణాంకాల ప్రాధాన్యత మీద అవగాహన చైతన్యం కలిగించడంఈ దినం యొక్క ముఖ్య లక్ష్యం.మహలనోబిస్ రచనలు కృషిలిభారత ప్రభుత్వం 2007 లో మొట్ట మొదటి సారిగా ప్రొఫెసర్ మహాలనోబిస్ జన్మదినమైన జూన్ 29 ని జాతీయగణాంకాలదినోత్సవంగాప్రకటించింది.స్టాటిస్టిక్స్ రంగములో మహాలనోబిస్ విశేషరచనలుచేశారు.మహాలనోబిస్ చేసిన శాంపిల్ సర్వే పరిశోధన ఫలితంగా దేశంలో పరిశోధన శిక్షణ సంస్థలు ఏర్పడ్డాయి.1931 లో ప్రొఫెసర్ మహాలనోబిస్ ఇండియన్ స్టాటిస్టికల్ఇన్స్టిట్యూట్స్థాపించారు. ఆయనను ఫాథర్ ఆఫ్ ఇండియన్ స్టాటిస్టిక్స్ అని కూడా పిలుస్తారు.పెద్ద ఎత్తున నమూనా సర్వే రూపకల్పన విధానాలు రూపొందించాడు.*

మల్టీవియారిట్ పై స్పేస్ లోని రెండు డాటా సెట్ల మధ్య పోలిక కొలమానమైన మహలనోబిస్ దూరం అనబడే పద్ధతిని రూపొందించాడు. ఈపద్ధతి ద్వారా అతను బాగా గుర్తుండి పోయాడు. రెండూ లేదా అంతకంటే ఎక్కువ వెరియబుల్స్ పరస్పర సంబంధం కలిగి ఉన్నప్పుడు మహల్ దూరంఉపయోగపడుతుంది. మరియు పాలకుడితో దూరాన్ని కొలవడం సాధ్యం కాదు.ఈ కొలత సమస్యనుపరిష్కరిస్తుంది.ఎందుకంటే ఇది బహుళ వేరియబుల్స్ కోసం పాయింట్ల మధ్య దూరాలను పరస్పర సంబంధం ఉన్న పాయింట్లను కూడా కొలుస్తుంది.ప్రణాళిక బద్దంగా సమాచారాన్ని రాబట్టడంలో గణాంకాలు అన్ని రంగాలలో బహుముఖ పాత్ర పోషిస్తాయి. గణాంకాల ద్వారా కచ్చితమైన సమాచారాన్ని స్పష్టంగా సంక్షిప్తంగాపొందవచ్చు.మహలనొబిస్ అనువర్తిత గణాంక వేత్త మహాలనోబిస్ దూరం 'గణాంక కొలత' యాదృచ్ఛిక నమూనా పద్ధతిని ప్రవేశ పెట్టాడు.నేటి సర్వేలకు ఆద్యుడు మహలనోబిస్లి నేడు నిర్వహిస్తున్న పలు సర్వేల విధానాన్ని పైలట్ సర్వేల భావాన్ని నమూనా పద్ధతుల ప్రాముఖ్యతను చాటి చెప్పాడు.భారత ప్రణాళిక వ్యవస్థ పితామహుడిగా గుర్తింపు పొందిన మహాలనో బిస్ సేవలను గుర్తించి భారత ప్రథమ ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ భారత ప్రభుత్వ గణాంక సలహాదారుగానియమించాడు.భారీవ్యూహం బి మహలనోబిస్ మోడల్లిభారీ పరిశ్రమలకు ప్రాముఖ్యత ఇచ్చిన భారత రెండవ పంచ వర్ష ప్రణాళిక (1956బి61)లో మహాలనోబిస్ సభ్యుడు సోవియెట్ ఆర్థిక వేత్త ఫీల్డ్ మాన్ తో కలిసి రెండవ పంచ వర్ష ప్రణాళిక కోసం రెండు రంగాల ఇన్పుట్ అవుట్ పుట్ మోడల్ ఫీల్డ్ మెన్ వ ు ఎ ్ ా ల స ో బి స ్ మోడల్సురూపొందించాడు.వర్ధమానఆర్థికవ్యవస్థ కుఉపయోగకరమైన ప్రమాణాలను మహాలనోబిస్ ప్రవేశ పెట్టాడు.మహాలనోబిస్ జాతీయాదాయ కమిటీ చైర్మన్ గా స్థూల జాతీయ ఉత్పత్తి అంచనాలు జాతీయ ఆదాయ అ ం చ ్ న ా ల క ్ ు ప్రాతిపదికలనురూపొందించాడు.ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి ఉత్పాదకత ఉపాధి మూలధన ఉత్పత్తి నిష్పత్తి పొదుపు పెట్టుబడి వృది అభివృధి మధ్య ఉన్న సంబశీధాన్ని మహాలనోబిస్ సమగ్రంగా అధ్యయనం పరిశోధన చేశారు.జాతీయ గణాంక వ్యవస్థనుస్థాపించడంలొ మహాలనోబిస్ కీలకపాత్ర పోషించాడు.గణాంకాల ప్రాధాన్యతలి గణాంకాలు డేటాను సేకరించడం విశ్లేషించడం' నిర్వహించడం ప్రాతినిధ్యం వహించడం లాంటి అంశాలు ప్రాముఖ్యాన్ని కలిగి వుంటాయి. దేశ ఆర్థిక ప్రణాళికలు ఆర్థిక విధానాలు వనరుల పంపిణీ కేటాయింపు వినియోగం వివిధ రంగాల మధ్య పెట్టుబడులు కేటాయింపుకు వివిధ రంగాల మధ్య బడ్జెట్ కేటాయింపు.ఆర్థిక ప్రగతి పురోగతి పథకాల రూపకల్పన సమీక్షా అమలుకు ఉపయోగ పడతాయి.విద్య వైద్య రంగం గణాంకాలులి ఆరోగ్య సంరక్షణ రంగములో గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయి.సామాజిక ఆర్థిక పారిశ్రామిక స ే ం వ ల ు నిర్వహించడంలోసహాయపడతాయి.దేశములో లభించే వనరులను సద్వినియోగం పరుచుకోవడానికి అవలంబించాల్సిన విధానాల రూపకల్పనలో ఉపయోగ పడతాయి.విద్య' వైద్య రంగాల అభివృద్ధికీ అవసరమగు ప్రణాళికలు రూపొందించడానికి ప్రణాళిక సంఘంగణాంకాలనుఉపయోగిస్తుంది.అభివృద్ధి వ్యూహాలు గణాంకాలులిఆరోగ్య సంరక్షణ మాత్రమే కాకుండా పారిశ్రామిక సేవా రంగాలలో అభివృధి వ్యూహాలను ప్రణాళికను రూపొందించడానికి సహాయ పడుతుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిర్మాణ రంగం అమ్మకాలు మార్కెటింగ్ బ్యాంకింగ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ రవాణా మొదలగు రంగాలకు గణాంకాలు దిక్సూచి లాగా పనిచేస్తాయి. మానవ జీవితములో ప్రభుత్వాల ఆర్థిక వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన గణాంకశాస్త్ర పరివ్యాప్తికి విశేష కృషి చేసిన ప్రొఫెసర్ మహాలనొబిస్ కృషిని విశ్వ వ్యాప్తంగా చేద్దామని ప్రతిజ్ఞ చేద్దాం. ఐక్యరాజ్య సమితి లక్ష్యమైన సుస్థిర అభివృధి లక్ష్య సాధనలో ముందుకు వెళ్ళడానికి పౌర సమాజం ప్రభుత్వాల భాగస్వామ్యం సమన్వయము సామర్థ్యం పెంచుకొని .సుస్థిర అభివృద్ధి సిద్ధిస్తుందని ఆశిద్దాం.నేదునూరి కనకయ్య అధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరంకరీంనగర్.

# పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.



28.06.2026 వ తేదీన జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమము జిల్లా వైద్య ఆరోగ్య శాఖాది కారిడాక్టర్ . ఆర్ . వెంకటరమణ అధ్యక్షతన అవగాహన ర్యాలీ నిర్వహించడమైనది. ఈ సందర్భముగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాది కారి డాక్టర్ ఆర్ . వెంకటరమణ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2,38,404 మంది 0 నుండి 5 సం. ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు



వేయవలసి వుందని , ఇందులకు సంబందించి జిల్లా వ్యాప్తంగా 1313 పోలియో బూతులను , 46 ట్రాన్సిట్ పాయింట్లను (బస్ స్టాండులు , రైల్వేస్టేషన్లు , మార్కెట్లు మొ ..) 67 మొబైల్ టీములు ఏర్పాటు చేయడము జరిగినది . ఈ కార్యక్రమములో 605 మంది ఏ ఎన్ ఎం లు , 369 మంది ఎం ఎల్ హెచ్ పి లు , 1595 మంది ఆశ కార్యకర్తలు పాల్గొంటున్నారు . కావున ఈ పల్స్ పోలియో కార్యక్రమమును విజయవంతము చేయవలసినదిగా కోరడమైనది. ఈ సందర్భయముగా జిల్లా ఇమునైజేషన్ అధికారి డాక్టర్ . సుదర్శన్ బాబు మాట్లాడుతూ 0–5 సం . ల లోపు పిల్లలందరికి తప్పని సరిగా పల్స్ పోలియో చుక్కలు వేసి వేయించి ఈ కార్యక్రమమును విజయవంతము చేయవలయునని తెలిపారు , ఈ కార్యక్రములో . డి సి హెచ్ ఎస్ డాక్టర్ ఓ. లలిత ,మునిసిపల్ కమీషనర్ బండి శేషయ్య , ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కాంతారావ్ నాయక్ , డాక్టర్ కె ఎస్ పి శ్రీనివాసులు , డాక్టర్ లక్ష్మీ ప్రసన్న గారు , డిప్యూటీ డి ఈ ఎం ఓ .పామన్న , ఎం పి హెచ్ ఈ ఓ లు శివరామయ్య , టి . జగదీశ్వరప్ప , ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశ కార్యకర్తలు పాలుగొన్నారు .

# పంతం నానాజీ ఖబడ్దార్.. జగన్న ఆదేశాలు ఇస్తే మా అడుగుల చప్పుడుకు నీ.. గుండె ఆగిపోతుంది జాగ్రత్త అని ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ ఇసాక్ బాష..

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్



రాజకీయాల్లో మరోసారి మాటల మంటలు రేగుతున్నాయి! వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై నంద్యాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిప్పులు చెరుగుతున్నాయి. పంతం నానాజీకి నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. "జగనన్న ఆదేశం ఇస్తే... మా అడుగుల చప్పుడుకే నీ గుండె ఆగిపోతుంది.. ఖబడ్దార్!" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహజం... కానీ విజ్ఞత మరచి, కోట్లాది మంది అభిమానించే ఒక ప్రజా నాయకుడిపై నోరుపారేసుకుంటే వైఎస్సార్



కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని నంద్యాల సాక్షిగా వైసీపీ నేతలు హెచ్చరించారు. జగనన్నను ఒక్క మాట అన్నా.. సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు! కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ.. జగన్ మోహన్ రెడ్డిపై చేసిన అసందర్భ, అనుచిత వ్యాఖ్యల పట్ల నంద్యాల లో వైఎస్సార్సీపీ శ్రేణుల గుండెల్లో ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడ్డాయి! ఖబడ్దార్ నానాజీ అంటూ ఎమ్మెల్సీ ఇసాక్ బాష చేసిన హెచ్చరికలతో నంద్యాల రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. నాయకుడిపై ఉన్న గుండె నిండా అభిమానంతో, వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు... పంతం నానాజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ను ముట్టడించారు. అక్కడ ఎస్ఐ కృష్ణారెడ్డికి నానాజీ అనుచిత వ్యాఖ్యలపై అధికారికంగా ఫిర్యాదు పత్రాలను అందజేశారు. చట్టం ముందు ఎవరైనా ఒకటేనని, జగనన్నపై విషం చిమ్మితే ఊరుకునేది లేదని ఖరాఖండిగా చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, వైసిపి రాష్ట్ర స్పొక్ పర్సన్ రవికుమార్,స్టేట్ ఎస్టి సెల్ సెక్రటరీ ఆంజనేయులు, రాష్ట్ర ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, వైసిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామ సుబ్బయ్య, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైసీపీ జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, జిల్లా వైసీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ,వైసీపీ జిల్లా సెక్రెటరీ దేవనగర్ భాష, వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టీవి రమణ వైసిపి అసెంబ్లీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, వైసిపి నంద్యాల అసెంబ్లీ ఎస్టి సెల్ అధ్యక్షుడు రామచంద్రుడు, వైసిపి నాయకులు సాయిరాం రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు చింత శ్రీనివాసులు, మేస చంద్ర శేఖర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

# రామచంద్రాపురంలోప్రశాంత తకు భంగం కల్గిస్తున్నవైసీపీనాయకుడు

**- టిడిపి నాయకుడుదయానంద రావ్**

దొర్నిపాడు జూన్ 27 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండల పరిధి లోని ప్రశాంత తాకు మారుపేరుఐన రామచంద్ర పురం గ్రామంలో ఉన్న వైసీపీ నాయకుడు చౌడయ్య తన వ్యక్తిగత పంట పొలాల సమస్య ను వైసీపీ, టీడీపీపార్టీల కువర్గ పోరుగచిత్రిక రిస్తున్నాడని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడుమూర్పు రిదయానంద రావుగ్రామ రైతులు అంటున్నారు రామ చంద్రా పురం గ్రామం ఏర్పడి దాదాపు 70 సంవత్సరాలు కావస్తున్న,భిన్న రాజకీయ పార్టీ ల ప్రతినిధు లుగ్రామం లో ఉన్న ఏనాడూగ్రామంలోతమ వ్యక్తి గత సమస్య లను రాజకీయ సమస్య లుగా మార్చ లేదన్నారు. వైసీపీ నాయకుడు తన పంట పొలాల సమస్య చట్ట పరంగా పరిష్కరించుకోవాలిగానితనసమస్య కోసం దళిత యువకులను పావులుగవాడుకొని మా పై ఉసిగొలపుతున్నారని అన్నారు. అంతే గాక టీడీపీ, వైసీపీ పార్టీ ల మధ్యఘర్షణవాతావరణంగమారుస్తున్నాడని. దీనిని గ్రామ ప్రజలు మండల ప్రజలు గమనించాలని అన్నారు. ఇప్పటి కైనా ఇలాంటి పద్ధతులకు స్వస్తీ చెప్పి తన వ్యక్తి గత సమస్య ను చట్ట పరంగా పరిస్కా రించు కోవాలని హితవు పలికారు నన్ను దుర్భాషలాడిన దళిత యువగుడిపై దొర్రిపాడు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు

# ఎస్ ఐ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం పై సమీక్షా సమావేశం.

**తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు.**





ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆదోని పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, ఆదోని నియోజకవర్గం ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు పట్టణంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, యువ నాయకుడు సిద్ధార్థ నాయుడు, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ పురోగతిపై చర్చించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడంతో పాటు, ఎలాంటి పొరపాట్లు జరగకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.అలాగే ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

**కొలిమిగుండ్లలో పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమం**



కొలిమిగుండ్ల (పల్లె వెలుగు న్యూస్) ప్రతినిధి :- కొలిమిగుండ్ల, నంద్యాల జిల్లా పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ కొలిమిగుండ్ల గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ పోలియో వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. రేపు అనగా 28వ తేదీ ఆదివారం ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లల ఆరోగ్య భద్రత కోసం పోలియో చుక్కలు ఎంతో ముఖ్యమని, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని పోలియో కేంద్రాలకు వెళ్లి తమ పిల్లలకు చుక్కలు వేయించాలని తెలిపారు. కొలిమిగుండ్ల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని గ్రామంలో ప్రజలకు పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది

## నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం

**- రాత్రి వేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్**

**- రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం**

పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో





ప్రజల భద్రత, శాంతిభ ద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీ సింగ్' కార్య క్రమాన్ని విస్తృతంగా కొన సాగిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో భా గంగా నేరాల నియంత్రణకు అనుమానా స్పద వ్యక్తులు, వాహనాలపై తని ఖీలు నిర్వహిస్తూ, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. కర్నూలు, ఎమ్మి గనూరు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టు దిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వ హించారు. కర్నూలు నగరంలో బ్లూ కోల్ట్స్ క్యూఆర్టీ పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కూడా చేపట్టారు అదే విధంగా రహదారి ప్రమాదాల నివార ణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహన దారులకు అవ గాహన కల్పిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తు లు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయ ల్-112 లేదా డయల్-100కు సమాచా రం ఇవ్వాలని సూచించారు.

## ఓబులంపల్లి పేరాయిపల్లి గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించిన తహశీల్దార్ జ్యోతిరత్నకుమారి



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 27 పల్లె వెలుగు మండలంలోని పేరాయిపల్లె, ఓబులంపల్లి గ్రామాల్లో ఎస్ఐఆర్ పై జరుగుతున్న ప్రక్రియను మండల తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఎస్ఐఆర్ ఫారంల పంపిణీ, డిజిటలైజేషన్ వివరాలను సంబంధిత బిఎల్ఓల ద్వారా తెలుసుకున్నారు. గడువు నాటికి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని బిఎల్ఓ లను తహశీల్దార్ ఆదేశించారు. ఈ ప్రక్రియకు ఇంటి వద్దకు వచ్చు బిఎల్ఓ లకు ప్రజలు సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని ఆమె కోరారు. ముందుగానే ఫోటోలు ఆధార్ కార్డు తదితర వివరాలను ప్రజలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ వలి ఉన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి " డాక్టర్ నరసింహ



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 27 పల్లె వెలుగ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ లో పల్స్ పోలియోపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహ మాట్లాడుతూ ఆళ్లగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్లో 31 బూత్ లు ఏర్పాటు చేశామని అందులో ఒకటి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేశామని అలాగే ఒక మొబైల్ టీం కూడా ఏర్పాటు చేశామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ నందు 0-5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. అందువల్ల ఈనెల 28వ తారీఖున పల్స్ పోలియో సందర్భంగా చిన్నారులకు పల్స్ పోలియో రాకుండా పోలియో చుక్కలు వేయించుకొని పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. చిన్నారుల భవితకు చుక్కల మందు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీతిక రెడ్డి , ఎంపిహెచ్ఈఓ వి. దస్తగిరి రెడ్డి , సూపర్వైజర్ భాగ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, సచివాలయం ఏఎన్ఎంలు మరియు ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# ఓటరు వద్దే డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**● ఓటర్లు ఫోటోలు, వివరాలు సిద్ధంగా ఉంచుకోవా ● ఎస్ఐఆర్ ప్రక్రియ సులువుగా, వేగంగా పూర్తి చేసేందుకు సహకరించా ● రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలి ● బిఎల్వోలతో ప్రతిరోజు బిఎల్ఏలు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి ● కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఓటరు వద్దకు వెళ్లినప్పుడే పూర్తిస్థాయిలో ముగించాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను సైతం అక్కడికక్కడే పూర్తి చేయాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. శనివారం బిఎల్వోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఈఆర్వో, ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించి, డిజిటలైజేషన్ వేగవంతానికి దిశానిర్దేశం చేశారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఓటర్లకు సూచనలు:

ఇంటింటికి బిఎల్వో వచ్చినప్పుడు రెండు హాఫ్‌సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఓటరు లేదా వారి తల్లిదండ్రులు, అవ్వ, తాతలు, నాన్నమ్మ, జేజి నాన్నమ్మల్లో ఎవరైనా 2002 సంవత్సరంలో రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, పార్ట్ నంబర్‌లలో ఎక్కడ నమోదై ఉన్నారో సంబంధించిన వివరాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఓట్లను తొలగిస్తున్నారనే పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి సమర్పిస్తే డ్రాఫ్ట్ ముసాయిదాలో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందని పక్షంలో బిఎల్వోను సంప్రదించాలని, అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**రాజకీయ పార్టీలకు సూచనలు:**

ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించే



సమయంలో తప్పనిసరిగా బిఎల్ఏలను పంపించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పూరింపు ప్రక్రియల్లో బిఎల్ఏలు చురుకుగా పాల్గొనాలని, తద్వారా ఫారాల డిజిటలైజేషన్‌ను సకాలంలో పూర్తి చేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఈఆర్వోలు తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, మేనేజర్ జునైద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడులతో బేబ్బేలు ఎత్తుతున్న ప్రజలు

**☛ చిన్నారులు ఇంటి బయట ఉంటే కుక్కల కాట్లకు గురికావాల్సిందే**

**☛ ఒకేరోజు నలుగురిని కరిచిన వీధి కుక్కలు**

**☛ వీధి కుక్కల పై ప్రభుత్వ చర్యలు లేవు**

దొర్నిపాడు జూన్ 27 పల్లె వెలుగు న్యూస్ ప్రతి గ్రామంలో రోజురోజుకు పిల్లలు పెద్దలు అన్న తేడా లేకుండా వీధి కుక్కల దాడిలో ఇండ్ల బయట ఉన్న చిన్న పిల్లలుకుక్కకాటులకు గురి అవుతున్నారు,వీధికుక్కల దాడులతోప్రజలు బేబ్బేలుఎత్తుతున్నారు అదేవిధంగా చిన్నారులు ఆట, పాటలకొరకు ఇంటి బయట ఉన్న కుక్క కాట్లకు గురికావాల్సిందే, ఒకే రోజు దొర్నిపాడు లో నలుగురిపై కుక్కల దాడి చేసిన సంఘటన గాయపడిన వారు స్థానిక ప్రాథమిక వైద్యశాలలో చికిత్సలు పొందినట్లు వైద్యాధికారి రహుల్లాఖాన్ తెలిపారు, కుక్కల దాడి పై ప్రభుత్వం చర్యలు లేవని ప్రజలు అంటున్నారు, వీధి కుక్కలు విచక్షణారహితంగా దాడి చేస్తూ పిల్లల్ని కరుస్తూ





గాయాలపాలు చేస్తున్న ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇదే విధంగా కుక్కల దాడులు జరుగుతూ ఉంటే చిన్నారుల ప్రాణాలుగాల్లో కలిసి పోవాల్సిందే శనివారం కుక్కల దాడిలో గాయపడిన వారికి వైద్య సిబ్బంది ప్రథమ చికిత్సలుచేసి వ్యాక్సిన్ వేసినట్లు సిబ్బంది శేఖర్ తెలిపారు, సంబంధిత ప్రభుత్వ అధికారులు కుక్కల దాడుల పట్ల స్పందించి కుక్కలకాట్ల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

# కర్నూలు డీసీసీబీ వార్షిక మహాజన సభ: రూ. 1.84 కోట్ల నికర లాభం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో జిల్లా సహకార



కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మహాజన సభ సమావేశం శనివారం (27.06.2026) కర్నూలు నంద్యాల రోడ్డులోని కె. ఫార్చ్యూన్ హోటల్‌లో ఘనంగా జరిగింది. బ్యాంకు పర్సన్ ఇంచార్జి కమిటీ ఛైర్మన్ శ్రీ డి. విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. బ్యాంకు గత ఆర్థిక సంవత్సరానికి (2025-26) గానూ రూ. 1 కోటి 84 లక్షల నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించారు.

సమావేశంలో బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ) శ్రీ పి. రామాంజనేయులు మార్చి 31, 2026 నాటి బ్యాంకు వ్యాపార లావాదేవీలపై విశాఖపట్నానికి చెందిన 'పెన్మెత్సా అసోసియేట్స్' చార్టర్డ్ అకౌంటెంట్స్ నిర్వహించిన ఆడిట్ నివేదికను సభ్యుల ఆమోదం కొరకు ప్రవేశపెట్టారు.

**రూ. 5000 కోట్ల వ్యాపారమే లక్ష్యం**

ఈ సందర్భంగా బ్యాంకు ఛైర్మన్ డి. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ బ్యాంకు వ్యాపారాన్ని ప్రస్తుతమున్న రూ. 4200 కోట్ల నుండి రూ. 5000 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ప్రకటించారు. అలాగే, ఈ ఏడాది కొత్తగా రూ. 700 కోట్ల రుణాలు మంజూరు చేయాలని



మరియు రూ. 300 కోట్ల డిపాజిట్లను సేకరించాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (ప్యాక్స్) పర్సన్ ఇంచార్జి ఛైర్మన్లు, సీఈఓలు నిరంతరం కృషి చేసి వ్యాపారాన్ని వృద్ధి చేయాలని కోరారు.

**తొర్రూరు' సంఘం ఆదర్శం నాన్ క్రెడిట్ వ్యాపారాలపై దృష్టి**

సహకార సంఘాలు కేవలం రుణాలకే పరిమితం కాకుండా నాన్ క్రెడిట్ వ్యాపారాలు చేసినప్పుడే లాభాల బాట పడతాయని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఇందుకు వరంగల్ జిల్లాలోని 'తొర్రూరు' సహకార సంఘాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నష్టాల నుండి లాభాల్లోకి వచ్చిన తొర్రూరు సంఘాన్ని ఇటీవల డీసీసీబీ ఉన్నతాధికారుల బృందం సందర్శించిందని, అక్కడ అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇక్కడి సంఘాల్లోనూ ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి హాజరైన తొర్రూరు సహకార సంఘం అధ్యక్షులు మరియు వరంగల్ డీసీసీబీ డైరెక్టర్ శ్రీ కాకిరాల హరిప్రసాద్ రావు మాట్లాడుతూ.. తమ సంఘం సాధించిన ప్రగతిని వివరించి, కర్నూలు సంఘాలు కూడా లాభాల బాటలో పయనించాలని ఆకాంక్షించారు. పారదర్శక సేవలు -- మొండి బాకీల వసూళ్లు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో కంప్యూటరీకరణ పూర్తయినందున, రైతులు చెల్లించే మొత్తాలకు కంప్యూటరైజ్డ్ చలానాలు జారీ చేసి పూర్తి పారదర్శకతతో సేవలు అందించాలని ఛైర్మన్ ఆదేశించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కేవలం 39 సహకార సంఘాలు మాత్రమే రుణాలు పొందేందుకు అర్హత సాధించాయని, మిగిలిన సంఘాలు కూడా అవసరమైన స్థాయిలో రికవరీ సాధించి రుణ అర్హత సాధించాలని కోరారు. బ్యాంకు బ్రాంచీలు, సంఘాల్లో పేరుకుపోయిన మొండి బాకీల వసూళ్లకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు ప్రమోషన్ల పంపిణీ బ్యాంకులో ఖాళీగా ఉన్న పోస్టులకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులను ఛైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (టూ+వీ) కేడర్‌లో ఇద్దరికి (శ్రీమతి కె. సరోజమ్మ, శ్రీ పి. రాఘవేంద్ర), అలాగే నలుగురికి చీఫ్ మేనేజర్ కేడర్ (శ్రీమతి ఎం. హైమావతి, శ్రీమతి ఎం. రమాదేవి, శ్రీ ఎస్. సరళ భారతి, శ్రీమతి డి. బీబి అయేషా) ప్రమోషన్ ఆర్డర్లు అందించారు. ఈ మహాజన సభలో డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీ నాగేశ్వర యాదవ్, కర్నూలు జిల్లా సహకార అధికారి శ్రీమతి చెన్నమ్మ, నంద్యాల జిల్లా సహకార అధికారి శ్రీ ఎన్. రామాంజనేయులు, ఆప్కాబ్ ప్రతినిధి శ్రీమతి వై. లావణ్య, డి.పి.డి.ఎం శ్రీ రంగనాథ్, వివిధ సహకార సంఘాల ఛైర్మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారారోయింగ్‌లో 'ప్యాపిలి' కెరటం: జాతీయ స్థాయిలో నారాయణకు డబుల్ గోల్డ్ మెడల్స్

పల్లె వెలుగు -?ప్యాపిలి ప్యాపిలి గ్రామానికి







చెందిన పారారోయింగ్ క్రీడాకారుడు కొంగనపల్లి నారాయణ జాతీయ స్థాయిలో అసాధారణ ప్రతిభ కనబరిచి సరికొత్త రికార్డు సృష్టించారు. దేశస్థాయి పారారోయింగ్ ఛాంపియన్షిప్‌లో వరుసగా రెండు రోజుల్లో రెండు బంగారు పతకాలను కైవసం చేసుకొని స్వగ్రామానికి, జిల్లాకు దేశవ్యాప్త గుర్తింపు తెచ్చారు. వరుస విజయాలతో స్వర్ణ కేతనం:

?జూన్ 26 అవుట్‌డోర్ విభాగం దేశంలోని 8 రాష్ట్రాల నుండి అత్యుత్తమ క్రీడాకారులు పాల్గొన్న దేశస్థాయి 'అవుట్‌డోర్ పారారోయింగ్ ఛాంపియన్షిప్'లో నారాయణ అద్భుత ప్రదర్శనతో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు.

?జూన్ 27 ఇండోర్ విభాగం శనివారం ఎనిమిది రాష్ట్రాల మధ్య అత్యంత హోరాహోరీగా జరిగిన దేశస్థాయి 'ఇండోర్ పారారోయింగ్ ఛాంపియన్షిప్'లోనూ నారాయణ తన జోరును కొనసాగించి, మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. వరుసగా రెండు రోజుల్లో రెండు స్వర్ణాలు సాధించి నారాయణ సంచలనం సృష్టించారు. ?ప్యాపిలిలో మిన్నంటిన సంబరాలు: ?జాతీయ స్థాయిలో డబుల్ గోల్డ్ మెడల్స్‌తో మెరిసిన కొంగనపల్లి నారాయణ ప్రతిభ పట్ల ప్యాపిలి గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నారాయణ సాధించిన ఈ విజయం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఇదే పట్టుదలతో భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై, ఒలింపిక్ స్థాయిలోనూ బంగారు పతకాలు సాధించి మన గ్రామానికి, దేశానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి" అని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు ఆకాంక్షిస్తూ ఆయనకు ఘనంగా శుభాభినందనలు తెలియజేశారు.

# ఎస్ఎల్ఏ గడువులోగా అర్జీలు పరిష్కారం కావాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పిజిఆర్ఎస్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యలను నాణ్యతగా పరిష్కరించేందుకు పిజిఆర్ఎస్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, పిజిఆర్ఎస్ సిబ్బంది తదితరులు




పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయి పర్యవేక్షణ చేయడం జరుగుతోందని అందుకు ప్రజా అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా సంబంధిత అధికారితో మాట్లాడి నాణ్యతతో ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పిజిఆర్ఎస్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 66,536 ప్రజా అర్జీలు స్వీకరించడం జరిగిందని, వాటిలో 61,710 దరఖాస్తులు నాణ్యతతో పరిష్కరించాం అన్నారు. అందులో రీఓపెన్ అయిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి ఉంచి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెన్ వెళ్లిన సంబంధిత అధికారులను కలెక్టర్ నేరుగా ఫోన్ చేసి అందుకు గల కారణాలు అడిగి తెలుసుకొని త్వరితగతిన సదురు అర్జీలను పరిష్కరించాలన్నారు. అంతకుముందు పిజిఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కార స్థాయి, నాణ్యత, ఆడిట్, ప్రీ ఆడిట్ అర్జీదారుల సంతృప్తి స్థాయి పట్ల పూర్తి స్థాయిలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

# రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది:డోన్ ఎమ్మెల్యే కోట్ల

పల్లె వెలుగు -?డోన్ రైతు సంక్షేమం






వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. డోన్ మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో విత్తనాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ ఆధునిక పద్ధతి ద్వారా తొలి వర్షాలతోనే పంట వేగంగా మొలకెత్తుతుందని, దీనివల్ల సాగు ఆలస్యం తగ్గడంతో పాటు దిగుబడి పెరిగే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.

**ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి:**

?రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, శాస్త్రీయ సలహాలను పాటించి ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక మార్గదర్శకాలు రైతు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి రైతుకు ఎల్లవేళలా అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు.

?"డోన్ నియోజకవర్గంలోని ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలి. తద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం.. సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి: డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి

పల్లె వెలుగు -?డోన్ ప్రజా సమస్యల పరిష్కారమే



పరమావధిగా, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని డోన్ టీడీపీ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు . శనివారం డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా వినతిపత్రాలను స్వీకరించారు.



?ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ ?ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజలు తమ పరిధిలోని పలు ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ?తాగునీటి సరఫరా: పలు వార్డులు, గ్రామాల్లో నీటి ఎద్దడి, క్రమబద్ధమైన సరఫరా లేకపోవడం. ?రహదారుల దుస్థితి: అంతర్గత రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం.

?సామాజిక పింఛన్లు: అర్హులకు పింఛన్లు అందజేయడం, సాంకేతిక సమస్యల తొలగింపు.

?విద్యుత్ ఆరోగ్యం: నాణ్యమైన విద్యుత్ సరఫరా, స్థానిక ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాల మెరుగుదల. ?అధికారులతో సమన్వయం.. తక్షణ చర్యలు ?ప్రజలు సమర్పించిన ప్రతి వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ఎంతో శ్రద్ధగా పరిశీలించారు. అక్కడికక్కడే కొన్ని సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడి, త్వరితగతిన తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ?"ప్రజా సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించడానికి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను నా దృష్టికి తీసుకురావచ్చు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం శ్రమిస్తాఅన్నారు. ?ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం.

**కర్నూలు పోలీసుల ప్రత్యేక చర్యలు.**





పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం రోడ్డు భద్రతపై పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధ నలు ఉల్లంఘించిన వారిపై జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. వాహ నదారులు ట్రాఫిక్ నిబంధ నలు పాటిం చాలని, హెల్మెట్ ధరిం చాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని మద్యంసేవించి వాహనాలు నడప వద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. రోడ్డు భద్ర తపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవ గాహన కార్యక్రమాలు నిర్వహిం చారు.

## అహోబిలం గ్రామపంచాయతీ టోల్ గేటు వేలం పాటలు

**25.04 లక్షలకు టెండర్ దక్కించుకున్న సానా సురేష్**



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 27 నంది పత్రిక ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో పంచాయతీ టోల్ గేటు వేలం పాటలను శనివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. అహోబిలంలోని టీటీడీ కళ్యాణ మండపంలో నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో ఈ వేలం పాటలను నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది డిపాజిట్ దారులు ఈ వేలం పాటలో పాల్గొన్నారు. అహోబిలం గ్రామానికి చెందిన సానా సురేష్ 20. 4 లక్షలకు వేలం పాడి గేటు అర్హతను దక్కించుకున్నారు. దీంతో గత ఏడాది కంటే మూడు లక్షల రూపాయలు గేటు ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు డి ఎల్ పి ఓ రాంబాబు తెలిపారు. గేటు వేలం పాటలలో ఇరు వర్గాలకు చెందినవారు పాల్గొనడంతో అహోబిలంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. దీంతో వేలంపాట పరిసరాల్లో రూరల్ సీఐ బీవీ రమణ, సిరివెళ్ల సిఐ రాము ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వేలంపాటల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ బీవీ రమణ ఎస్ఐ వరప్రసాద్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు . ఈ వేలంపాట లో ఈఓఆర్డి సరళ, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మను కలిసిన విశ్వబ్రాహ్మణులు



ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 27 పల్లె వెలుగు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ ఆళ్ళగడ్డ విచ్చేసిన సందర్భంగా వారిని కలిసిన ఆళ్ళగడ్డ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు కడప జిల్లా పులివెందుల లింగాల లోపానుతల గ్రామంలో నాలుగు సంవత్సరాల చిన్నారి హత్య జరిగింది ఈ సందర్భంగా ఆ గ్రామానికి వెళ్లి బాధ్యత కుటుంబాన్ని పరామర్శించి అనంతరం తిరుగు ప్రయాణంలో ఆళ్లగడ్డలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులందరినీ ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమె అందరినీ పేరుపేరునా పలకరించారు అనంతరం తిరిగి కర్నూలు కి వెళ్ళిపోయారు.

## ఎమ్మిగనూరులో అదనపు బాలికల హైస్కూల్ ఏర్పాటు చేయాలి




ఎమ్మిగనూరు, జూన్ 27 (పల్లె వెలుగు): ఎమ్మిగనూరు పట్టణంలో విద్యార్థినుల సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో అదనపు బాలికల హైస్కూల్‌ను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న మాచాని సోమప్ప బాలికల హైస్కూల్‌లో సుమారు 3 వేల మంది విద్యార్థినులు చదువుతున్నారని, తరగతి గదులు, ఉపాధ్యాయులు, మరుగుదొడ్ల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. అలాగే నవోదయ కోచింగ్ సెంటర్లకు అక్రమంగా టీసీలు ఇస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను త్వరగా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారి నిత్విక హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష విధించాలి



కడప, జూన్ 27 (పల్లె వెలుగు): లింగాల మండలం లోపానుతల గ్రామంలో నాలుగేళ్ల చిన్నారి నిత్విక హత్య ఘటనను తీవ్రంగా ఖండించిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ, నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి చిన్నారికి నివాళులర్పించిన ఆమె, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులు, సాక్షులకు రక్షణ కల్పించాలని, ఈ ఘటనపై జిల్లా ఎస్పీ, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com